### లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో

# టీడీపీ నేతల పూజలు

హిందూపురం టౌన్,సెప్టెంబర్6(ఆన్‌లైన్) :పరిగి మండలం వంగలపల్లిలో పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ నిమ్మలకిష్టప్ప సోమవారం సందర్శించారు. దేవాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు చేశారు. పరిగి మండల నాయకులు వారి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. పరిటాల సునీత రాకను తెలుసుకున్న సమీప గ్రామ ప్రజలు అధికసంఖ్యలో విచ్చేశారు. మండల నాయకులు బాలాజీ, సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి స్వామి, కాలువపల్లి సత్తి, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎంపీ నిమ్మల, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అబ్దుల్‌ఘని

# బాబాను దర్శించుకున్న గీతారెడ్డి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్6(ఆన్‌లైన్): సమాచార, పర్యాటకశాఖ మంత్రి గీతారెడ్డి సాయిబాబా దర్శనార్థమై పుట్టపర్తికి విచ్చేశారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ఆమెకు తహసీల్దార్ నాగభూషణ, డీపీఆర్ఓ ప్రసాద్ స్వాగతం పలికారు. సాయంత్రం 4.30 సాయికుల్వంత్ భామందిరంలో బాబాను దర్శించుకుని ఆశీస్సులు పొందారు.


పుట్టపర్తి రైల్వేస్టేషన్‌లో మంత్రి గీతారెడ్డి

# వేపచెట్టుకు కల్లు


కల్లు కారుతున్న వేపచెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 6 (ఆన్‌లైన్): మడకశిర మండలం ఏఆర్ రొప్పం గ్రామ సమీపంలో పొలాల్లో ఉన్న వేపచెట్టు నుంచి కల్లు కారుతోంది. దీంతో ఆ గ్రామస్థులు ఆ వేపచెట్టుకు కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పిన ప్రకారం వేపచెట్లులో కల్లుకారడం నిజమైందన్నారు. దీంతో తాము వేపచెట్టు నుంచి కారుతున్న కల్లుకు కుండ కట్టి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### వంగలపల్లి అభయాంజనేయస్వామికి

# మంత్రి, ఎంపీ పూజలు

హిందూపురం టౌన్,సెప్టెంబర్6(ఆన్‌లైన్): పరిగి మండలం వంగలపల్లిలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి ఆలయప్రారంభోత్సవ వేడుకలకు వ్యవసాయశాఖ మంత్రి రఘువీరారెడ్డి, బళ్ళారి ఎమ్మెల్సీ కొండయ్య, ఎంపీ అనంతవెంకటరామిరెడ్డి, కర్నాటక పీసీసీ సభ్యుడు కులశేఖర్‌రెడ్డి సోమవారం హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి పరిగి, పురం ఇన్‌చార్జ్‌లు కేటీ శ్రీధర్, అంబికా లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నాటక పీసీసీ సభ్యుడు కులశేఖర్‌రెడ్డి వంగలపల్లి గ్రామ ప్రజలతో ఉన్న అనుబంధంతో ఆలయాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆలయాభివృద్ధి కమిటీ అన్నదానం నిర్వహించింది.


పూజా కార్యక్రమంలో మంత్రి రఘువీరా తదితరులు

## మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

అనతపురం,సెప్టెంబర్6(ఆన్‌లైన్): గ్రీవెన్స్‌లో భాగంగా కలెక్టర్ జనార్ధన్‌రెడ్డి స్థానిక కలెక్టరేట్ ఆవరణలో పలువురు వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లను సోమవారం పంపిణీ చేశారు. తాడిమర్రి మండలం ప్రేమ్‌కుమార్, ఎన్‌పీకుంట వెంకటన్న, సీకేపల్లి సుబ్రమణ్యం, చిలమత్తూరు చంద్రప్ప సైకిళ్లు పొందిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి సోమిరెడ్డి, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## లక్ష్యసాధనకు కృషి చేయండి

### బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం,సెప్టెంబర్6(ఆన్‌లైన్): ఖరీఫ్ పంటరుణాల మంజూరు గడువు ఈనెల 20వరకు పొడించినట్లు కలెక్టర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో పంట రుణాల మంజూరుపై బ్యాంక్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు రూ.1567 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 20వతేదీలోపు మిగిలిన రూ.33కోట్ల పంటరుణాలను అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య పరిరక్షణ కింద ఎనిమిది ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో వాటర్ ప్యూరిఫైర్‌లను ఏర్పాటు చేసేందుకు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్ర,సిండికేట్ బ్యాంక్ జీఎం రవిశంకర్, కెనరా బ్యాంక్ అధికారి కులకర్ణి, డీసీసీ బ్యాంక్ అధికారి నరసింహారెడ్డి, అనంత గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


